ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి

డోర్నకల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తోడేళ్లగూడెం గ్రామశివారులోని సుబ్రమణ్యేశ్వర ఆలయంలో బుధవారం స్వామివారి షష్టిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపై ఇరుకుగా ఉన్న రాళ్ల మధ్య స్వామివారు వెలిశారు. దీంతో భక్తులు గుట్టపైకి ఇరుకుమార్గం ద్వారా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



- డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం
- పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌తో మద్యం వ్యాపారుల్లో జోష్
- ఓట్ల వేటలో మద్యం పంపిణీ షరామామూలే
- డిసెంబరు 17వ వరకు ఎన్నికలు ఉండటంతో మద్యానికి ఫుల్ డిమాండ్
- ఈ నెల 28నుంచే కొత్త మద్యం షాపులకు లిక్కర్ కేటాయింపులు
- ఉమ్మడి జిల్లాలో 294 మద్యం షాపుల యాజమానులు ఫుల్‌ఖుషీ

లిక్కర్‌షాపులకు ఎన్నికల కిక్కు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కొత్త మద్యం షాపులకు పంచాయతీ ఎన్నికలు కిక్కు ఇవ్వనున్నాయి. 2025-27 సంవత్సరానికి ఇటీవలే మద్యం షాపులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. గత అక్టోబరు 27న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294షాపులకు లక్కీ డ్రా ద్వారా లిక్కర్ ఓనర్లను ఎంపిక చేశారు. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త షాపులను ప్రారంభించేందుకు మద్యం షాపు యాజమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. దీంతో లిక్కర్ షాపుల యాజమానులకు షాపుల ప్రారంభంలోనే లాభాల కిక్కు తగలనుందనే టాక్ వినబడుతుంది. ఏడాది కాలంలో మేడారం మహజాతరతో పాటు పరిషత్తు, మునిసిపాలిటీ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉండటంతో ఈసారి మద్యం దుకాణాలు దక్కించుకున్న వారి మహ అదృష్ట వంతులనే టాక్ వినబడుతుంది.

1న కొత్త మద్యం షాపులు

మద్యం షాపులకు లోకల్ బాడీ ఎన్నికలు కలిసి రానున్నాయి. వరంగల్ అర్బన్‌లో 67మద్యం షాపులు ఉండగా, వరంగల్‌రూరల్ జిల్లాలో 57 షాపులు, మహబూబాబాద్ జిల్లాలో 61 షాపులు, జనగామ జిల్లాలో 50, భూపాలపల్లి, ములుగు జిల్లాలో 59షాపులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 294మద్యం షాపులు ఉండగా, 10,493 దరఖాస్తులు వచ్చాయి. వీటికి సంబంధించి అక్టోబరు 27వ తేదీన లక్కీ డ్రా ద్వారా మద్యం షాపు యాజమానులను ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 28వ తేదీ నుంచి మద్యం కేటాయింపులు చేయనున్నారు. డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం షాపుల్లో అమ్మకాలు చేయనున్నారు. రెండేళ్ల పాటు మద్యం అమ్ముకోవటానికి ప్రభుత్వం లైసెన్స్‌లు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ఇన్‌స్టాల్‌మెంట్ పేమెంట్‌లు షాపు ఓనర్లు పూర్తి చేస్తున్నారు. బ్యాంకు గ్యారంటీలతో పాటు షాపు నిర్వహణకు అనువైన ప్రాంతంలో గదులను వెతికే పనిలో పడిపోయారు.

ఎన్నికల కిక్కు

కొత్త మద్యం షాపులకు ప్రారంభంలోనే పంచాయతీ ఎన్నికల రూపంలో కలిసి వస్తోంది. పాత షాపులకు నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికి, కొత్త షాపులు ఈ నెల 28వ తేదీ నుంచే మద్యం కేటాయింపులు చేస్తున్నారు. డిసెంబరు 1 నుంచి అమ్ముకునేలా ఎక్సైజ్‌శాఖ అనుమతులను ఇస్తోంది. కాగా, ఇప్పటికే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించింది. నవంబరు 27వ తేదీ నుంచి డిసెంబరు 17వ తేదీ వరకు మూడు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల

(మిగతా 7లో..)

నామినేషన్ల పండుగ

- నేటి నుంచి పంచాయతీ పోరు దరఖాస్తులు స్వీకరణ
- తొలి విడతలో ఐదు మండలాలు.. 155 గ్రామ పంచాయతీలు, 1,338 వార్డులు
- ఎలక్షన్ల నోటిఫికేషన్‌తో నామినేషన్ల పర్వం షురూ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



మహబూబాబాద్ రూరల్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నామినేషన్ల సందడి నెల కొననుంది. గురువారం నుంచి గ్రామ పంచాయతీల ఎలక్షన్ల నామినేషన్ల స్వీకరణ ఆరంభం కానుంది. ఉదయం 10.30 గంటలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌తో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుంది. జిల్లాలోని 18 మండలాల పరిధిలో మొత్తం 482 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మూడువిడతల్లో డిసెంబరు 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి విడతలో 05 మండలాలు, రెండోవిడతలో 07, మూడోవిడతలో 06 మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

డిసెంబరు 11న జరిగే మొదటివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27 నుంచి నామినేషన్ల ప్రక్రియను ప్రారంభమవుతుంది. తొలివిడతలో మహబూబాబాద్ నియోజకవర్గం గూడూరు మండలంలోని 41 గ్రామపంచాయతీలు, 354 వార్డులు, ఇనుగుర్తి మండలంలోని 13 పంచాయతీలు, 112 వార్డులు, కేసముద్రం మండలంలోని 29 పంచాయతీలు, 254 వార్డులు, మహబూబాబాద్ మండలంలోని 41 పంచాయతీలు, 338 వార్డులు, నెల్లికుదురు మండలంలోని 31 పంచాయతీలు, 280 వార్డులు వెరసి ఐదు మండలాలకు సంబంధించి 155 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, 1338 వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయి.

నోటిఫికేషన్ విడుదలతోనే నామినేషన్లు..

జిల్లాలో గురువారం నాడు వెలువడే ఎన్నికల నోటిఫికేషన్‌తో డిసెంబరు 11న తొలి విడతలో జరిగే ఐదు మండలాల పరిధిలోని 155 గ్రామ పంచాయతీల ఎన్నికల ప్రక్రియ ఆరంభమవుతుంది. ఈ నెల 27వ తేదీ నుంచి 29 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 30వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు నామినేషన్లను పరిశీలన చేస్తారు. ఆ తర్వాత చెల్లుబాటు అయిన నామినేషన్ల జాబితాను ప్రకటిస్తారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణ డిసెంబర్ 1వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఆయా అభ్యంతరాల పరిష్కరణ 2న సాయంత్రం 5 గంటల్లోపు చేస్తారు. ఎవరైనా అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి వస్తే 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం

(మిగతా 8లో..)


మహబూబాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రఘుపతిరెడ్డి

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలి

వీసీలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని

మహబూబాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని సూచించారు. హైదరాబాద్ నుంచి అన్నిజిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో బుధవారం జీపీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించాలని ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని, డిసెంబర్ 11న మొదటివిడత, 14న రెండోవిడత, 17న పోలింగ్ జరుగనున్నట్లు చెప్పారు. నవంబర్ 23న ఫైనల్ చేసిన ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రకారం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. రెండు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న భవనం దగ్గర హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్‌కాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలను పంపాలని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ గురువారం ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలన్నారు. నోటిఫికేషన్ జారీతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్

ఏడుగురు ఎస్టీ ఓటర్లు.. 4 పదవులు

- సర్పంచ్, ముగ్గురు వార్డుసభ్యుల స్థానాలు రిజర్వు
- మహమూద్‌పట్నంలో వింత పరిస్థితి





కేసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను తిరిగి ప్రకటించిన అనంతరం గ్రామంలో అత్యల్ప సంఖ్యలో ఉన్న ఓటర్లకు పదవులు రిజర్వు చేయడంతో సింగిల్ డిజిట్ ఓటర్ల మధ్యేపోటీ నెలకొంది. కేసముద్రం మండలం మహమూద్‌పట్నంలో 576 ఓటర్లు ఉండగా, ఈ గ్రామ సర్పంచ్ స్థానం సెప్టెంబరు 27న ఎస్సీ మహిళకు కేటాయించినట్లుగా నిర్ణయించారు. అయితే అధికారిక ప్రకటన మాత్రం ప్రభుత్వం విడుదల చేయలేదు. తాజాగా ఇచ్చిన రిజర్వేషన్ల జాబితాలో మార్పులు చోటు చేసుకొని ఈ గ్రామ సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్‌కు రిజర్వు చేశారు. అంతేకాకుండా మొదటి, మూడో వార్డు ఎస్టీ జనరల్‌కు, రెండోవార్డు ఎస్టీ మహిళకు కేటాయిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించారు. అయితే ఈ గ్రామంలో ఎస్టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన రెండు కుటుంబాలే ఉన్నాయి. ఇందులో ఈ రెండు కుటుంబాల్లో ముగ్గురు చొప్పున ఆరుగురు

(మిగతా 8లో..)

సర్పంచ్ రిజర్వేషన్‌పై హైకోర్టుకు

మహమూద్‌పట్నం సర్పంచ్ స్థానం రిజర్వేషన్‌ను అధికారులు అసంబద్ధంగా చేశారని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించినట్లు ఆ గ్రామానికి చెందిన మిట్టగడుపుల యాకూబ్, కాసోజు యాకాంతాచారి, సిలువేరు లింగయ్య తెలిపారు. బుధవారం రాత్రి వారు మాట్లాడుతూ గ్రామంలో 576 మంది ఓటర్లు, అందులో ఎస్టీ ఓటర్లు ఏడుగురు ఉన్నారని తెలిపారు. అయితే అధికారులు రిజర్వేషన్ చేస్తున్న సమయంలో 1332 మంది ఓటర్లు అందులో 557 మంది ఎస్టీ ఓటర్లు ఉన్నట్లుగా లెక్కించి తమ గ్రామాన్ని ఎస్టీకి కేటాయించారని ఆరోపించారు. మళ్లీ ఓటర్లను పరిశీలించి రిజర్వేషన్‌ను కేటాయించాలని, అప్పటి వరకు గ్రామంలో ఎన్నికలు నిలిపివేయాలని కోరుతూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశామని వారు తెలిపారు.

ఎలక్షన్ల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- ఎస్పీ శబరీష్
- కేసముద్రం సర్కిల్‌లో ఠాణాల తనిఖీ

కేసముద్రం/నెల్లికుదురు/ఇనుగుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలని ఎస్పీ శబరీష్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కేసముద్రం సర్కిల్‌లోని కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసముద్రంలో యూపీ, హత్య

(మిగతా 8లో..)



కేసముద్రంలో పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీష్

షెడ్యూల్డ్ ఏరియా నుంచి రెండు గ్రామాలను తొలగించాలన్న పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలంలోని గూడూరు, అయోధ్యపురం రెవెన్యూ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియా ప్రాంతంలోకి రావని ప్రకటించాలని.. ఆ ఊళ్లకు షెడ్యూల్డ్ ఏరియా హోదాను తొలగించాలని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. తమ రెండు గ్రామాలు 1950లో విడుదలైన ప్రెసిడెన్షియల్ నోటిఫికేషన్‌లో లేవని.. అయినప్పటికీ వాటిని షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చారని.. ఇది అక్రమమని ప్రకటించడంతో పాటు వాటిని నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించేలా ఆదేశాలు జారీచేయాలని పేర్కొంటూ కత్తి స్వామి, మరికొంతమంది గ్రామస్థులు హైకోర్టులో పిటిసన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 1951 నుంచి 1981 వరకు జనాభా లెక్కలు చూసుకున్న తమ గ్రామాల్లో ఎస్టీల జనాభా చాలా తక్కువగా ఉందని.. ఈ గ్రామాల్లో శాశ్వత నివాసులుగా ఉన్న తమకు ఇళ్లు, వ్యవసాయ భూములు ఉన్నాయని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ఏరియా గుర్తింపు వల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్, ఎన్నికల్లో పోటీచేయడం వంటి అంశాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం.. పిటిషన్ దాఖలు చేయడంలో విపరీతమైన ఆలస్యం జరిగిందని.. ఇప్పటికే 75 సంవత్సరాలు గడిచిపోయాయని పేర్కొంది. ప్రెసిడెన్షియల్ నోటిఫికేషన్‌ను సవాల్ చేయకుండా పిటిషనర్లు ఉపశమనం పొందలేరని స్పష్టం చేసింది. ఈ మేరకు సదరు గ్రామాల షెడ్యూల్డ్ ఏరియా గుర్తింపును రద్దు చేయలన్న పిటిషన్‌ను కొట్టేసింది.

'పంట దిగుబడులను శాస్త్రీయంగా లెక్కించాలి'

డోర్నకల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించే పంటలను వ్యవసాయ క్షేత్రంలోనే నిర్ణీత ప్రదేశంలో వచ్చిన దిగుబడిని శాస్త్రీయంగా లెక్కించాలని తహసీల్దార్ రాఘవరెడ్డి అన్నారు. బుధవారం చిల్కోడులో దడిగెల రవి అనే కౌలురైతు వరిపొలంలో పంట కోతల ప్రయోగం కార్యక్రమాన్ని నిర్వహించారు. కోసిన వరిని లెక్కించగా 12.85 కేజీలు దిగుబడి వచ్చింది. దీంతో ఎకరానికి సుమారు 19 క్వింటాలు దిగుబడి వస్తుందని ప్రయోగం ద్వారా రుజువైనట్లు తహసీల్దార్ తెలిపారు. దీంతో ముందస్తు దిగుబడి అంచనా వేయడమే కాక ఎగుమతి, దిగుమతులపై స్పష్టమైన అంచనా వేయవచ్చన్నారు. గణాంక అధికారి రాంధన్, ఎంపీఎస్‌వో సింది, ఆర్ఐ యాసిన్‌పాష, జీపీవో యుగంధర్ పాల్గొన్నారు.


వరికోసి పంట దిగుబడిని అంచనా వేస్తున్న తహసీల్దార్

నూతన ఆవిష్కర్తలు విద్యార్థులే

- ముగిసిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి

జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ ముగింపు సమావేశంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న విద్యాశాఖ అధికారులు

8



పారాలీగల్ వలంటీర్లు కృతనిశ్చయంతో పని చేయాలి

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రఫీ

8

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ధీరజ్ కుమార్

తొర్రూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తొర్రూరు కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి దామెర ధీరజ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఇంత గొప్ప రాజ్యాంగాన్ని మనం అవలంబించడం గొప్ప విషయమని, దీనిని అందించిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. బాధ్యతగల పౌరులు రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రతి ఒక్కరూ గౌరవించి కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముకుందరావు, ఉపాధ్యక్షుడు గణపురం రామకృష్ణ, ఏజీపీ లింగాల శ్రీనివాస్, న్యాయవాదులు మహేష్, నాగరాజు, మధుసూదన్, ప్రవీణ్‌రాజు, వెంకటరత్నం, ఐలోని, విజయ, యాకేందర్, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో..

రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అవార్డు గ్రహీత రాయిశెట్టి ఉపేందర్ మాట్లాడుతూ 76వ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో అందరు సమానమే అనే భావనను భారత రాజ్యాంగం కల్పించిందని, ఇది గొప్ప రాజ్యాంగం అని కొనియాడారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆర్. వెంకన్న, యాకేందర్, యాకయ్య, నాగయ్య, సుధాకర్, మధు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక హక్కులపై ప్రభుత్వాలే అవగాహన కల్పించాలి

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పీఠిక ప్రాథమిక హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ప్రజలకు అవగాహన కల్పించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని జయపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా దేశంలో ఉన్న ప్రతి భారతీయ పౌరుడికి ప్రాథమికమైన హక్కులు కాపాడడం కంటే హరించే పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. 14వ అధికరణం ప్రకారం కుల, మత, ప్రాంతం భేదాలు లేకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్, పంచాయతీ కార్యదర్శి వినోద్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మందుల రామ్మూర్తి, రావుల శ్రీను, యాకయ్య, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మరిపెడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సైకిల్‌ను బైక్ ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం స్థానిక అయ్యప్ప స్వామి టెంపుల్ సమీపంలో నేషనల్ హైవేపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్న గూడూరు మండల కేంద్రానికి చెందిన వల్లెపు ఎల్లయ్య-ఉపేంద్ర బైక్‌పై మరిపెడ బంగ్లా నుంచి చిన్నగూడూరుకు వెళ్తుండా సైకిల్‌ను ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి వారు ఇద్దరు కిందపడ్డారు. దీంతో ఉపేంద్రకు కాలు విరుగగా, ఎల్లయ్య స్వల్ప గాయాలకు గురయ్యారు. స్థానిక 108 వాహనంలో క్షతగాత్రులను చికిత్స కోసం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. 108 ఈఎంటీ సిబ్బంది ఫరాన్, రవీందర్ ప్రథమ చికిత్సలు జరిపి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

సమాజ నిర్మాణంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జనగామ కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జనగామ ఏఎంవో బొమ్మనబోయిన శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పెంబర్తి జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మింపజేసే భావి భారత పౌరులను తయారు చేయడంలో ప్రముఖమైన పాత్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయులదే ఉంటుందన్నారు. కాబట్టి పాఠశాలలో చదివే విద్యార్థులకు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, క్రీడా కౌశలాలు, మానసికుద్వేగాలకు లోను కాకుండా వ్యాయామ విద్యలో తర్ఫీదునిచ్చి గొప్ప సమాజాన్ని నిర్మింపజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.నాగరాణి, డీఆర్పీలు గంగిశెట్టి మనోజ్‌కుమార్, కైరిక హనుమంతరావు, ఆవుల అశోక్, జనగామ పాఠశాల క్రీడా కార్యదర్శి జాటోతు గోర్‌సింగ్ పాల్గొన్నారు.

మూడు నెలలపాటు ముహూర్తాలు లేవు

- ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్రమౌఢ్యం
- గృహ ప్రవేశాలు, వివాహ శుభకార్యాలకు బ్రేక్

తొర్రూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల 28వ తేదీ శుక్రవారం శుద్ధ సప్తమి ప్రారంభం కానున్నా శుక్ర మౌఢ్యం (మూఢం) మాఘ బహుళ అమావాస్య 2026 ఫిబ్రవరి 17 వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు సెలవు ప్రకటించాల్సిందే.

మూఢం అంటే ఏమిటి?

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాలతో కనుమరుగైపోవడాన్ని మూఢం అంటారు. గ్రహశక్తులు బలహీనం అవడంతో శుక్రగ్రహం సూచించేఫలితాలు అంతగా అనుకూలించవు. శుభకార్యాలకు గురుడు ఎంతప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. శుక్రుడు బలహీనమైతే సంబంధాలు, వివాహ జీవితం ఆర్థికస్థిరత్వం వంటి విషయాల్లో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిష్యులు చెపుతున్నారు. అందుకే శుక్రమౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలుజరపడం శుభసూచికంకాదని సూచిస్తున్నారు.



పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ సారి మార్గశిరంలో 1, 2 ముహూర్తాలు మాత్రమే ఉండగా పుష్యమాసం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘ మాసంలో ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. గృహప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదిన మైన వసంత పంచమి, ఘనంగా కీర్తించబడే నాగపౌర్ణమి వంటి తిథులు ఈసారి మూఢంలోనే కలిసి పోతున్నాయి. దీంతో ముహూర్తాలు లేవు.

ముహూర్తాలు ఉండవు..



వెన్నప్ప సంతోష్ శర్మ, పండితుడు

ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలలపాటు శుభకార్యాలకు మంచి రోజులులేవు. శుక్ర మౌఢ్యం వలన ఒక శుభ మహూర్తం కూడా ఉండదు. జ్యోతిష్యశాస్త్ర ప్రకారం తెలుగు నెలలు సుమారు 25రోజులపాటు ముందురావడం, అధిక మాసం రాకపోవడంతో ముహూర్తాలు లేవు. దీంతో వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, ఎంగేజ్‌మెంట్‌లు చేసుకోకూడదు. వైదిక, పౌరోహిత్యంపై ఆధారపడిన బ్రాహ్మణులకు మూడు నెలల పాటు కష్టకాలమే.

తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది..

- జలగం శంకర్, టెంట్‌హౌజ్ నిర్వాహకుడు

మూడు నెలల పాటు శుభకార్యాలు లేక పోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సివస్తుంది. ఇప్పటికే ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో టెంట్‌హౌజ్ గిరాకీలు తగ్గిపోయాయి. దీంతో చేతినిండా పని దొరకడం లేదు. ఈసారి ముహూర్తాలు లేకపోవడంతో పనిచేసే వారికి వేత నాలు ఇవ్వడం కూడా కష్టకానుంది.

ఈ రంగంపై ఆధారపడిన వారందరి పరిస్థితి గడ్డుకాలంగానే మారుతుంది. ఈసారి ముహూర్తాలు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొంది.

సిద్ధేశ్వరాలయంలో చోరీ

చెన్నారావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సిద్ధేశ్వరాలయంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని సిద్ధేశ్వరాలయంలో మంగళ వారం ఆలయ పూజారి భిక్షమయ్యశాస్త్రి రోజు వారి మాదిరిగా పూజలు చేసి ఆలయానికి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయానికి ఉన్న ఇనుప రాడ్‌లను వంచి ఆలయంలోనికి ప్రవేశించారు. అమ్మవారి తలుపు తాళం పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న కిలో వెండి కిరీటంతో పాటు 18 బిళ్లల బంగారహారం, బంగారు పుస్తెలు సుమారు. రూ.4లక్షల విలువ చేసే వస్తువులను దొంగి లించారు. బుధవారం ఉదయం అర్చకులు ఆలయం తాళం తీసి చూడగా అమ్మవారి ఆలయంలో చోరి జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే గ్రామంలోని ఓ బెల్టు షాపులోనూ దొంగతనం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

కంపుకొడుతున్న డ్రైయినేజీ



రాంవిలాస్ గల్లీ కార్నర్‌లోని డ్రైనేజీ

మరిపెడ, నవంబ రు 26 (ఆంధ్రజ్యోతి) : కంపుకొడుతున్న డ్రైనేజీతో మరిపెడ మునిసిపాలిటీ లోని రాంవిలాస్ గల్లీవాసులు, బస్టాండ్ సమీపంలోని గృహ స్థులు బేజారవుతున్నారు. పట్టణ నడిబొడ్డున కంపుకొడు తున్న డ్రైనేజీ కాల్వపై మునిసిపాలిటీ అధికారులకు ఫిర్యాదులు అందినా గింత పట్టింపులేదని ప్రజలు వాపో తున్నారు. ఈ డ్రైనేజీ కాల్వను నేషనల్ హైవే పక్కన ఉన్న మెయిన్ డ్రైనేజీలో కలుపకుండా ఓపెన్‌గా వదిలే యడంతో డ్రైనేజీ కంపు పట్టణ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇప్పటి కైనా మునిసిపాలిటీ అధికారులు స్పందించి ఈ డ్రైనేజీ కాల్వకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.

కొనుగోలు సెంటర్లలో ఎక్కడి ధాన్యం అక్కడే..



మండల కేంద్రంలో కాంటాకాని ధాన్యం

దంతాలపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు తూర్పుతండా, బీరిశెట్టిగూడెం, కుమ్మరికుంట్ల, పెద్దముప్పారంలోని కొనుగోలు కేంద్రా ల్లో పోసిన ధాన్యం రాశులు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. గత వారం రోజుల కిందట డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ లాంచనంగా ప్రారంభిన కొనుగోలు కేంద్రాల్లో రాశులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. కానీ, కాంటాలు కాకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తూర్పుతండాలో లారీలు లేక ధాన్యం తరలించడం లేదంటూ గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారితో పాటు ఇన్‌చార్జిల నిర్లక్ష్యం కారణంగా రైతులకు తీప్పలు తప్పడంలేదు. మండలంలోని 18 గ్రామాలకు ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేటికి ఆయా సెంటర్లలో తాగునీటి, విద్యుత్ సౌకర్యం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రైతుల ధాన్యం వెంటనే కాంటాలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే క్రిమినల్ కేసులు



ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

దంతాలపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తే క్రిమినల్ కేసులకు సిఫారస్సు చేస్తామని స్థానిక ఎస్సై పిల్లల రాజు హెచ్చరించారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని దుబ్బతండా గ్రామంలో గిరిజనులకు బెల్టు షాపులు, గుడుంబా నిషేదంపై వివరించారు. ఈ నెల 25 నుంచి పంచాయతీ ఎన్నికలకు గాను ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్‌ను అమలులో తెచ్చిందన్నారు. గ్రామాల్లో గుంపులు గుంపులుగా నిలబడొద్దన్నారు. బెల్లం, పటిక, బెల్టుషాపుల్లో మద్యం దొరికితే తప్పక షాప్ సీజ్ చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు విద్యాపరంగా మంచి అవకాశాలు ఉన్నందున యువత బాగా చదువుకోవాలన్నారు. బడి ఈడు పిల్లలను పనిలో ఉంచకుండా బడికి పంపాలన్నారు. పల్లెల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్లో ఫిర్యాదు చేయాలన్నారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

రాయపర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరిపిరాల గ్రామ దుర్గమ్మ గుడిలో చోరీ జరిగిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థాని కుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మొరిపిరాల గ్రామ శివారులోని దుర్గమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు టవల్ చుట్టుకుని మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు. అమ్మ వారి మెడలో ఉన్న 50తులాల వెండి, 6గ్రాముల బంగారం, హుండీలోని నగదు ఎత్తుకెళ్లినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల వైర్లను కట్‌చేసి ప్రవేశించినట్లుగా తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కంచనపల్లిలో చోరీ

రూ 1.50 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణ

రఘునాథపల్లి, నవంబరు 26(ఆం ధ్రజ్యోతి): ఇంట్లో బీరువాలో దాచిపె ట్టిన రూ.1.50 లక్షల నగదుతో పాటు రెండున్నర తులాల బంగారం, 30 తులాల వెండి చోరీకి గురైన సంఘ టన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి గ్రామం లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దురుసో జు సందీప్ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ప్రస్తుతం తన కుటుంబం నివాసముంటు న్న ఇల్లు మట్టి గోడలతో నిర్మించినం దున శిథిలావస్థకు చేరుకోగా, కొత్త ఇంటి నిర్మాణం కోసం పొదుపు చేసిన రూ.1.50 లక్షల నగదుతో పాటు రెండున్నర తులాల బంగారం, 30 తులాల వెండిని తన ఇంట్లో ఉన్న బీరువాలో దాచిపెట్టాడు. మట్టితో కట్టిన ఇల్లు కూలిపోతుందన్న భయం తో తన ఇంటి పక్కన ఉన్న మొగిలయ్య ఇంట్లో రాత్రి పూట తన కుటుంబ సభ్యులతో కలిసి పడుకుంటున్నాడు.

ఇదే అదనుగా భావించిన కొంద రు గుర్తు తెలియని దుండగులు ఇంట్లోని బీరువాను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్లి చూసే సరికి బీరువా పగుల గొట్టి ఉండడంతో పాటు బీరువాలోని బట్టలన్ని చిందరబందరగా పడి ఉన్నాయి. దీంతో భయాందోళనకు గురైన బాధితులు బీరువాను పరిశీలించారు. బీరువాలోని నగదుతో పాటు బంగారం, వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇంటి పరిసరాలను సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ డి.నరేష్ సందర్శించి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలు గుణపాఠం చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పేరుతో నమ్మించి గొంతు కోసిన సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. ఈ నెల 29న జరగనున్న దీక్షా దివస్, వచ్చే నెలలో జరిగే పంచాయతీ ఎన్నికలపై భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధించిన నాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ఈ నెల 29న రాష్ట్రమంతా నిర్వహిస్తున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ జిల్లా కార్యా లయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి జిల్లాలోని కార్యకర్తలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సీఎంగా పనిచేసిన కేసీఆర్ అప్ప ట్లో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేసిందని దుయ్యబ ట్టారు. ప్రస్తుతం రిజర్వేషన్‌లను కేవలం 17 శాతానికే పరిమితం చేశారని మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసే అభ్యర్థు లు అధికంగా గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కళ్లెపు రఘుపతిరావు, మందల విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తేనెటీగల పెంపకం శిక్షణ



శిక్షణ పొందిన వారితో ఏఎంసీ చైర్‌పర్సన్, అధికారులు, నిర్వాహకులు

కాటారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నేషనల్ బీ బోర్డ్ (ఎన్‌బీబీ) సహకారంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్‌ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఆయిల్ సీడ్ మిషన్‌లో భాగంగా తేనె ఉత్పత్తి, నూనె గింజల ఉత్పాదకతను పెంచడంపై వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25మంది రైతులకు ఎన్ఐపీహెచ్‌ఎం ఏడీ జ్యోతి, అసిస్టెంట్ సైంటిఫిక్ ఆఫీసర్ శక్తివేల్, నేచురల్ హనీ ఫౌండర్ సంజన పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహాముత్తారం మండలంలోని మహబూబ్‌పల్లిలో తేనెటీగల పెంపకానికి అనువైన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, రైతులు పోచిరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, ప్రతాప్, మధు, అశోక్, కుమార్, రాజేంద్రప్రసాద్, రమేష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఏఎంసీ సిబ్బంది మల్లికార్జున్, సత్యం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం సంఘాల ఆరాటం

బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్

కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక కోడ్లతో 40 కోట్ల అసంఘటిత కార్మికులకు ప్రయోజనం కలగనుందని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే పలు కార్మిక సంఘాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. భూపాలపల్లిలోని బీఎంఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన నాలుగు కార్మిక చట్టాల కోడ్లు కార్మికులందరికీ అనుకూలంగా ఉన్నాయని, దీన్ని బీఎంఎస్ స్వాగతిస్తోందని తెలిపారు. బ్రిటీష్‌కాలంలోని పాత చట్టాలను మార్చి, నూతన కార్మిక కోడ్లుగా కేంద్రం తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో వెలబోయిన సుజేందర్, పాండ్రాల మల్లేష్, రమేష్, కొత్తూరు మల్లేష్, రఘుపతిరెడ్డి, అన్నం శ్రీనివాస్, తాండ్ర మొగిలి, దాసరి ఓదేలు, కె. భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పాని శ్రీనివాస్

శతాధిక వృద్ధురాలి మృతి



శ్యామక్క (ఫైల్)

గణపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు గడ్డమీది శ్యామక్క(102) బుధవారం ఉదయం మృతిచెందింది. 1923లో శ్యామక్క జన్మించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త ముత్తయ్య 25ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. శ్యామక్కకు నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. 70మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారని, శ్యామక్క ఐదు తరాల సంతానాన్ని చూసిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

హత్యచేసిన కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు, జరిమానా

వరంగల్ లీగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అత్తపై దాడిచేసి హత్యకు కారణమైన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగారా శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా సెషన్స్ జడ్జి బీవీ నిర్మల గీతాంబ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ సుజ్జిత్ నగర్‌కు చెందిన వెంకటమ్మకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో సునితను వంగ సంపత్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ అనంతరం అత్త వెంకటమ్మకు చెందిన ఖాళీ స్థలంలో అల్లుడు సంపత్ రెండు రూములు నిర్మించి ఒక రూములో తాను, మరో రూంలో అత్త నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో అత్త వెంకటమ్మ తన అల్లుడు సంపత్ సరిగా చూసుకోవడం లేదని అనారోగ్యంతో ఉన్నా తనను పట్టించుకోవడం లేదని ప్రతీ రోజు గొడవ పడుతుండేది. ఇదిలా ఉండగా 2023 ఆగస్టు 23న మద్యం సేవించి ఇంటికి వచ్చిన నిందితుడు సంపత్ అత్తపై సుత్తెతో తలపై కొట్టి పారిపోగా వెంకటమ్మను చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. నిందితుడి వంగ సంపత్‌పై పోలీసులు హత్యానేరం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు పీసీ దాడి శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎన్. కరుణాకర్‌రావు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

ఎన్నికల్లో.. ఎన్ని కలలో..

» పంచాయతీ పోరుపై పల్లెల్లో జోరుగా మంతనాలు
» సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలపై దృష్టి
» పార్టీల గుర్తులు లేకుండా ఎన్నికలు
» ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అన్ని పార్టీలు



హనుమకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడం, ఎన్నికల షెడ్యూల్ కూడా జారీ కావడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ కాగానే ఈనెల 27 నుంచి మొదటి విడత ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల దాఖలు కూడా మొదలవుతుంది. దీంతో పల్లెల్లో మంతనాలు జోరందుకున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యంగా సర్పంచ్ పీఠంపై కన్నేసిన వారంతా జిల్లా, రాష్ట్ర నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకున్నా గ్రామ స్థాయిలో తమ పార్టీ పునాదులను పటిష్ఠం చేసుకోవడానికి అభ్యర్థులను రాజకీయ పార్టీలు బలపరుస్తాయి.

మంతనాల జోరు

రిజర్వేషన్ల అనుకూలత, గెలుపు అవకాశాలపై లెక్కలు వేసుకొని అప్పుడే ఆశావహులు ఎమ్మెల్యేలతో మంతనాలు జరుపుతున్నారు. ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల వివరాలు తెలుసుకొని ఆ మేరకు ఆ పంచాయతీల్లో పోటీ చేసి గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులను గుర్తించే పనిలో పడ్డారు. మండలాల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో తాజా రాజకీయ పరిస్థితులు, పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మండల స్థాయి నాయకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల్లో గెలుపు ధీమా అధికంగా ఉంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వు అయిన గ్రామ పంచాయతీల్లో కొంచెం ఆర్థిక పరపతి ఉన్నవారు పోటీకి సన్నద్ధమ వుతున్నారు. సర్పంచ్ పదవులకు పోటీ ఎక్కువ ఉన్న చోట అసంతృప్తి చోటు చేసుకోకుండా పార్టీ నాయకులు ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఒకరిని సర్పంచ్, మరొకరిని ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలోకి దింపాలని యోచిస్తున్నారు. పల్లెల్లో పట్టు సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పార్టీ గుర్తులు లేకపోయినా తమ కార్యకర్తలను గెలిపించుకోవాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నాయి.

బీజేపీ ఆరాటం

మరో వైపు బీజేపీ కూడా పంచాయతీ ఎన్నికల్లో ఖాతాలను తెరవాలని చూస్తోంది. వీలైనంత మేరకు తమ పార్టీ నాయకులు సర్పంచులుగా గెలిచేలా వ్యూహరచనలు చేస్తోంది. వాస్తవానికి గత పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు దారుల్లో ఎక్కువ మంది సర్పంచ్‌లుగా గెలవలేక పోయారు. ఫలితంగా గ్రామ స్థాయిలో ఆ పార్టీ పునాదులు అంత బలంగా లేవు. ఈ దృష్ట్యా పల్లెల్లో పార్టీని విస్తరించేందుకు, పునాదులను పటిష్ఠపరుచుకునేందుకు పంచాయతీ ఎన్నికలను ఒక అవకాశంగా వాడుకోవాలని చూస్తోంది.

కాంగ్రెస్ వ్యూహాలు

అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపు ధీమాతో కొద్ది నెలల నుంచే పావులు కదుపుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేష న్లు కల్పించడం ద్వారా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను గంప గుత్తగా తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నించినప్పటికీ కోర్టు తీర్పులతో ఆ వ్యూహం బెడిసికొట్టింది. అయినా కూడా జనరల్ స్థానాల్లో వీలయినంత ఎక్కువ మంది బీసీలకు పార్టీ పక్షాన మద్దతు ఇవ్వడం ద్వారా వారి గెలుపు కోసం కృషి చేయాలని యోచిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కావడంతో వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఎన్నికల షెడ్యూల్ జారీ కావడానికి ముందే ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేసింది. దీంతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యుల మద్దతును కూడగట్టుకునేందుకు కూడా కోడ్ అమలుకు కొన్ని గంటల ముందే వడ్డీ లేని రుణాలను విడుదల చేసింది. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, గృహజ్యోతి వంటి సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఉంది.

బీఆర్ఎస్‌కు సవాల్

మరో వైపు బీఆర్ఎస్ పార్టీ కూడా తన వంతు ప్రయత్నాలను మొదలు పెట్టింది. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం చవి చూసిన ఆ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పునరుజ్జీవనం పొందే ఆలోచనలో ఉంది. ఈ మేరకు గత పదేళ్ల పాలనలో పంచాయతీల అభివృద్ధికి చేసిన కృషిని, గ్రామాల్లో కల్పించిన మౌలిక వసతులను గుర్తు చేయడం ద్వారా పల్లె ఓటర్లను ప్రసన్నం చేసుకునే దిశగా వ్యూహాలను రచిస్తోంది. పల్లెల్లో బీఆర్ఎస్‌కు ఇప్పటికీ గట్టి పునాదులే ఉన్నాయి. క్యాడర్ ఉంది. క్రియాశీల నాయకులు ఉన్నారు. వారందరిలో ఉత్సాహం నింపడం ద్వారా పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు నడుం బిగిస్తున్నారు. పనిలో పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమకు అనుకూలంగా మారుతుందని ఆ పార్టీ నాయకులు బలంగా నమ్ముతున్నారు.

ఎన్నికల వ్యయాలపై నిఘా

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ఓటింగ్ సమయంలో వెబ్ కాస్టింగ్‌తో పాటు వీడియోగ్రఫీ నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. బుధవారం రాత్రి సర్పంచ్ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిమితుల విషయంలో వివరాలను ప్రకటించారు. 5 వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50వేలు, 5 వేల జనాభా లోపున్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.30 వేల వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. అన్ని మండల కేంద్రాల్లో క్లస్టర్లను ఏర్పాటు చేశామని, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు తమ క్లస్టర్ పరిధిలో సూచించిన పంచాయతీల్లో నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చని వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు, 2024 ఎస్‌సీపీసీ సర్వే ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కేటాయించామని స్పష్టం చేశారు.

భర్త ఫంక్షన్‌కు తీసుకుపోలేదని..

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

సంగెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భర్త ఫంక్షన్‌ను తీసుకుపోలేదని భార్య క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఎల్గూరు రంగంపేటలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఎల్గూరు రంగంపేటకు చెందిన గుగులోత్ కవిత(28), తన భర్త సుకుమార్ ఫంక్షన్‌కు వెళ్లే విషయంలో గొడవ పడ్డారు. సుకుమార్ తన ఇద్దరు పిల్లలను తీసుకుని బొల్లికుంటలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. మనస్తాపం చెందిన కవిత ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు భూక్యా రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కూతుళ్ల పెళ్లి చేయలేక..

రాయపర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూతుళ్ల వివాహాలు చేయలేక, కుటుంబాన్ని పోషించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొత్తూరులో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన భీమని యాదగిరి (52) కూలీ చేసుకుని జీవిస్తున్నాడు. మొదట వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు కాగా, భార్య అనారోగ్యంతో చనిపోయింది. దీంతో రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు సైతం ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు.

మొత్తం ఐదుగురు కాగా, ఇద్దరి వివాహాలు చేశాడు. దీంతో మిగతా వారికి వివాహాలు చేయాలన్నా, కుటుంబాన్ని పోషించలేక మనోవేదనకు గురయ్యే వాడు. ఈ నెల 25న ఉదయం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా సాయంత్రం 5 గంటల సమయంలో ఊరి చివర చెట్టుకు యాదగిరి ఉరి వేసుకుని ఉండడం కంటపడింది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మృతుడి తల్లి భీమని రామలచ్చమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిజీ బిజీగా కేటీఆర్ పర్యటన

ఘన స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు

హనుమకొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. దీక్షాదివాస్ సన్నాహక సమావేశానికి హైదరాబాద్ నుంచి ఉదయం హనుమకొండకు బయలుదేరిన కేటీఆర్‌కు కరుణాపురం వద్ద ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాజీపేట జంక్షన్‌లోని బాపూజీ నగర్ చౌరస్తాకు చేరుకోగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మధ్యాహ్నం రంగశాయిపేటకు చేరుకోవడంతో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కేటీఆర్ అక్కడి నుంచి గీసుగొండ మండలంలోని టెక్స్‌టైల్ పార్కు సందర్శన ముగించుకుని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. సుమారు 2000 మంది బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో దీక్షాదివాస్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అక్కడి నుంచి మడికొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ నాయకుడి కూతురి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి జనగామ దీక్షాదివాస్ సన్నాహక సమావేశానికి వెళ్లారు. కేటీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, బీఆర్ఎస్ నాయకులు జోరిక రమేష్, పోలెపల్లి రామ్మూర్తి, పులి రజనికాంత్, బుద్దె వెంకన్న, సోదా కిరణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

భలే రుచిగా ఉన్నాయి..

బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షాదివాస్ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో కార్యాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ పిండి వంటల షాప్‌ను సందర్శించారు. ఆయనకు మహిళలు తినుబండారాలు అందజేశారు. వాటిని రుచి చూసిన కేటీఆర్.. భలే రుచిగా ఉన్నాయని కితాబు ఇచ్చారు. అనంతరం కొన్ని పిండివంటలు ఇంటికి తీసుకెళ్లారు. షాప్ నిర్వాహకులు ఉమాదేవి, ఉష, అర్చనలు పిండి వంటల గురించి కేటీఆర్‌కు వివరించారు.

కేటీఆర్ కాన్వాయ్ ఢీకొని ఒకరికి గాయాలు



కాన్వాయ్ ఢీకొని కింద పడిన ద్విచక్ర వాహనదారుడిని పైకి లేపుతున్న స్థానికులు

హనుమకొండ టౌన్ : బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో బుధవారం కేటీఆర్ ప్రయాణించిన కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. సుబేదారి సీఐ మేకల రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పరకాలకు చెందిన శ్రీనివాస్ రెడ్డి రాపిడో ద్విచక్ర వాహనంపై చిల్డ్రన్స్ పార్కు జంక్షన్ వైపు వస్తుండగా మూల మలుపు వద్ద కేటీఆర్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడి తలకు గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు వచ్చి శ్రీనివాస్ రెడ్డిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారులో కేటీఆర్ లేరు. అయితే కేటీఆర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిందని పలువురు స్థానికులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కలకలం రేగింది.

టెక్స్‌టైల్ పార్కుతో మహర్దశ

» స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలి
» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గీసుగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)తో వరంగల్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి నాటి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. ఒకప్పుడు అజాంజాహి మిల్‌తో వరంగల్‌కు వస్త్రపరిశ్రమ గుర్తింపు ఉండేదని, అది కనుమరుగైన తరువాత కేఎంటీపీతో టెక్స్‌టైల్ హబ్‌గా మళ్లీ పూర్వవైభవం సంతరించుకోబోతుందని హర్షం వ్యక్తంచేశారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని చింతలపల్లి వద్ద టెక్స్‌టైల్ పార్కును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కైటెక్స్ కంపెనీలో ఆధునాతన పద్ధతిలో జరుగుతు్న టెక్స్‌టైల్ ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల వివరాలను కంపెనీ ఎం.డి. మనోజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు.

సూరత్, షోలాపూర్, బీవండి వంటి ప్రాంతాలకు నేతన్నల వలసలను అరికట్టేందుకు టెక్స్‌టైల్‌పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఆనాడు దేశంలో వస్త్ర పరిశ్రమలకు ఎలాంటి పాలసీలు లేవని, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో మన దేశం కంటే ఎక్కువగా వస్త్ర ఉత్పత్తులు జరుగుతుండడంతో దేశంలో అతిపెద్ద కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు రూపకల్పన చేసినట్లు వివరించారు. సూరత్, తిరుపూర్‌లా ఫామ్ టు ఫ్యాషన్ తరహాలో కైటెక్స్, యంగ్‌వన్ వస్త్ర పరిశ్రమలు చురుకుగా ఏర్పాటు అవుతున్నాయన్నారు. స్థానిక పత్తి రైతులకు, కూలీలకు ఉపాధి లభించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు జరగాలని భావించినట్లు చెప్పారు. గణేషా, కైటెక్స్, యంగ్‌వన్ కంపెనీలు ఉత్పత్తులను ప్రారంభించడంతో దాదాపు 30వేల మందికి ప్రత్యక్షంగా అంతకు డబుల్ పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదన్నారు. పార్కు ఏర్పాటైన నాలుగు సంవత్సరాల తరువాత కేంద్రం పీఎంశ్రీ కింద చేర్చిందని గుర్తు చేశారు. అయితే పార్కులో ఇంకా పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపల్లి వద్ద పార్కులోకి రావటానికి రైల్వే పై ఓవర్ బ్రిడ్జిని కూడా నాడు తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆర్వోబీ బ్రిడ్జిని, పార్కులు డ్రైనేజీ, సీవరేజ్ సిస్టంలను పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు.



టెక్స్‌టైల్ పార్క్ సందర్శనలో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన 9300 ఎకరాల భూమి అమ్మకాలతో, ఫ్యూచర్ సిటీ పేరుతో రూ.5 లక్షల కోట్లు దండుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండగా మారారని కేటీఆర్ ఈ సందర్భంగా తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 21 పారిశ్రామిక వాడల్లో 9300 ఎకరాలను సేకరించి పరిశ్రమల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేసిందన్నారు. అయితే ఆభూమిని తక్కువ ధరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రేవంత్‌రెడ్డి కట్టబెడుతున్నారని ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నారన్నారు. స్థానిక మునిసిపాలిటీల తీర్మానం లేకుండా, అఖిల పక్షంతో మాట్లాడకుండా, శాసన సభలో చర్చించకుండా ప్రజాప్రయోజనాలకు సేకరించిన భూములను ఇష్టానుసారంగా ప్రభుత్వం ఎందుకు అమ్ముతుందని నిలదీశారు. సీఎం, అతని అన్నదమ్ములు, అనుచరులు భూములను అమ్మడం ద్వారా, ఫ్యూచర్ సిటీ పేరుతో రూ.5 లక్షల కోట్లు కొల్లగొట్టి రాహుల్‌గాంధీకి ఏటీఎం, పేటీఎంగా మార్చుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్య, జడ్పీ మాజీ చైర్మన్ గండ్ర జ్యోతి, రాకేశ్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్ మనోహర్, మాజీ జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి నాయకులు జయపాల్‌రెడ్డి, చల్ల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్ →





అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేటీఆర్ బీఆర్ఎస్ నాయకులు ←

సమయం లేదు..



» ఎన్నికల బరిలోకి ఆశావహులు
» పార్టీల పేరు చెప్పుకోవడానికి ఆసక్తి చూపని అభ్యర్థులు
» స్వతంత్ర అభ్యర్థినే ప్రజలు ఆదరిస్తారని బరిలోకి..
» గ్రామానికి పదుల సంఖ్యలో పోటీకి సిద్ధమవుతున్న నాయకులు

ఎల్కతుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచ్‌ల ఎన్నికల సందడి ప్రారంభమయ్యింది. రిజర్వేషన్ అనుకూలించిన వ్యక్తులు రంగంలోకి దిగారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గ్రామాల్లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మొదటి విడతలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ, అదే రోజు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వార్డుల వారీగా పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శన, 29న నామినేషన్ల చివరి తేదీ, 30న నామినేషన్ల పరిశీలన, అదేరోజు చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా ప్రదర్శన, డిసెంబరు 1న అభ్యంతరాలపై అప్పీల్‌కు చివరి తేదీ, 2న అప్పీల్ పరిష్కరణకు చివరి తేదీ, 3న నామినేషన్ల ఉపసంహరణ, 3న పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ప్రదర్శన, 11న ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల నిర్వహణకు కేవలం 15 రోజుల సమయం ఉండటంతో పోటీదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల బరిలో దిగడానికి ఎక్కువ సమయం లేకపోవడంతో బరిలో ఉండే ఆశావహులు ఓటర్లను వేగంగా ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఎవరి అంచనాల్లో వారు..

రాజకీయ పార్టీ పరంగా ఎన్నికల బరిలో నిలిస్తే పడే ఓట్లను ఆయా పార్టీ పేరుతో ముందుకెళ్లే అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. తమ పార్టీకే గ్రామాల్లో ఉనికి ఉందని ఎవరికి వారే ఊహించుకుంటున్నారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరక్కపోవడంతో పార్టీ పేరు చెప్పుకొని పోటీలో ఉంటే ఆదరణ ఉండదని మరికొందరు భావిస్తున్నారు. వ్యక్తిగత పలుకుబడితో స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళితే ఆదరిస్తారనే భావనలో కొందరున్నారు. ప్రతీ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులుగా 10 మందికి పైగానే బరిలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఓటర్లు డబ్బు వైపా ? వ్యక్తిత్వం వైపా?

గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సర్పంచ్‌లను ఎన్నుకోవడంలో ఓటర్లు డబ్బు వైపు మొగ్గు చూపుతారా? లేదా అభ్యర్థి వ్యక్తిత్వాన్ని బట్టి ఓట్లు వేసి ఎన్నుకుంటారా? అనే ప్రశ్నలు సర్పంచ్ ఆశావహుల్లో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. సర్పంచ్ బరిలో నిలిచే అభ్యర్థులు కేవలం ఆ పార్టీ పేరు చెప్పుకోవడమే తప్ప పార్టీ ఎలాంటి బీ-ఫారంలు అందించక పోవడంతో ఒకే పార్టీ నుంచి ఎక్కువ సంఖ్యలో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ ఆ పార్టీ అభ్యర్థి ఓట్ల కోసం ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గతంలో చేసిన అభివృద్ధి పనులను వెల్లడిస్తూ ఓట్లను అభ్యర్థించే పనిలో పడ్డారు. కానీ, ఓటర్లు డబ్బులు ఎక్కువగా ఇచ్చిన వ్యక్తులకు ఓట్లు వేస్తారా? గ్రామ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజలతో మమేకమయ్యే అభ్యర్థులకు పట్టం కడుతారా? అనే సందిగ్ధం నెలకొంది. డబ్బు పంచనిదే ఓట్లు పడవని నిర్ధారణకు వచ్చిన వ్యక్తులు ఎన్ని ఓట్లకు ఎంత డబ్బులు పంచాలో లెక్కలు వేసుకుంటున్నారు. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బుకు ప్రధాన్యత ఇవ్వాలా.. లేక వ్యక్తిత్వాన్ని చూసి ఓట్లు వేయాలా.. అనే ప్రశ్నలు ఓటర్లను సైతం వెంటాడుతోంది.

ఎల్కతుర్తిలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఎల్కతుర్తి మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీలకు, 103 వార్డులకు, భీమదేవరపల్లి మండల పరిధిలో 25 గ్రామ పంచాయతీలకు, 132 వార్డులకు, కమలాపూర్ మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలకు, 137 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాలను సిద్ధం చేసి గ్రామాల్లో ప్రదర్శించడం జరిగింది. ఎన్నికల నిర్వహణ సామగ్రి సైతం సిద్ధంగా ఉండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

లిక్కర్ షాపులకు

ఎన్నికల కిక్కు

(5వ పేజీ తరువాయి)

చేయనున్నారు. నామినేషన్‌ల ఘట్టం 29వ తేదీతో ముగుస్తుంది.

డిసెంబరు 1 నుంచే అసలైన ఎన్నికల సంగ్రామం మొదలు కానుంది. ఇదే తేదీ నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. ఒక్కొక్క గ్రామంలో 15రోజుల వరకు ఎన్నికల తంతు జరుగుతుంది. అన్ని ప్రధాన పార్టీలు తమ మద్దతుదారులను బరిలో దించేందుకు సిద్ధమవుతున్నాయి. లోకల్‌బాడీ ఎన్నికల్లో మద్యం కీలకమనే బహిరంగ రహస్యమే. పోటీదారులు భారీ ఎత్తున మద్యాన్ని కొనుగోలు చేసి డంప్ చేయటం, ఆ తరువాత పోలింగ్ ముందు పంపిణీ చేయటం జరిగే తంతే. అన్ని ప్రధాన పార్టీలు కూడా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ తీవ్రంగా ఉండటంతో పాటు లిక్కర్‌కు కూడా భారీగా డిమాండ్ పెరగనుంది. దీంతో కొత్తగా మద్యం షాపులను దక్కించుకున్నవారికి పంచాయతీ ఎన్నికలతో భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందనే టాక్ వినబడుతుంది.

- కలిసి వస్తున్న అదృష్టం..

కొత్త మద్యం షాపు యాజమానులకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మేడారం మహజాతరకు కూడా కలిసి రానుంది. డిసెంబరు 17వ తేదీతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఈ ఎన్నికల తరువాత జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మేడారం మహజాతర ఉంది. దీంతో పల్లెల్లో నెల రోజుల ముందు నుంచి ఊళ్లలో బద్దిపోశమ్మ, మైసమ్మ, ఎల్లమ్మలకు వేడుకలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. వీటితో పాటు ఇంటి వద్ద సమ్మక్క, సారలమ్మల పండుగ జరుపుకుంటారు. దీంతో మద్యం అమ్మకాలకు భారీగా డిమాండ్ పెరగనుంది. మేడారం మహజాతరతో పాటు జాతరకు ముందు మొక్కులు కూడా మద్యం వ్యాపారానికి కలిసి రానుంది.

అలాగే ఇప్పటికే వాయిదా పడిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా జనవరి లేదంటే ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికే మునిసిపాలిటీల పదవీకాలం కూడా పూర్తయింది. గ్రేటర్ వరంగల్ పాలక వర్గం కూడా జూన్ నెలతో ముగుస్తుంది. దీంతో వరుసగా పరిషత్తు, మునిసిపాలిటీ ఎన్నికలు రానుండటం మద్యం షాపు యాజమానుల పంట పండినట్లేననే చర్చ జరుగుతోంది. ఈ ఏడాదంతా ఏదో రకంగా మద్యానికి గిరాకీ వస్తుండటంతో మద్యం షాపులు దక్కని వ్యాపారులు భారీగా గుడ్‌విల్ ఆఫర్ చేసి చాలా చోట్ల షాపులను కొనుగోలు చేశారని తెలిసింది. ఆయా ఏరియాలను బట్టి మద్యం షాపులకు రూ.60లక్షల నుంచి రూ.1.35కోట్ల వరకు గుడ్‌విల్ ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు.


జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి రైన్ కోట్స్, టీషర్ట్స్ పంపిణీ చేస్తున్న శబరీష్

ప్రజలకు పోలీస్‌శాఖపై నమ్మకం కలిగించాలి

● జిల్లా ఎస్పీ శబరీష్

మహబూబాబాద్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో శాఖా పరమైన గుర్తింపు పొంది, ప్రజలకు పోలీస్‌శాఖపై నమ్మకం కల్గించేలా పని చేయాలని ఎస్పీ శబరీష్ సూచించారు. బుధవారం మానుకోట పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ పోలీస్ సిబ్బందికి రేయిన్‌కోట్స్, టీషర్ట్స్, జాకెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా కాలానికి అనుగుణంగా డీజీపీ కార్యాలయం నుంచి పోలీస్ సిబ్బందికి రేయిన్ కోట్స్, టీషర్ట్స్, జాకెట్‌లను ప్రత్యేకంగా కేటాయించామన్నారు. ఈ ప్రత్యేక సూట్స్ విధి నిర్వహణలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, ఆర్ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్

గార్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల రాకేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పందులు, గేదెలు ఆవరణలో తిరుగుతూ విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టి నిధులు విడుదల చేసి, సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు కొర్ర పూజేష్, మండల నాయకులు వసంత్ కుమార్, గణేష్, మహేష్, దివ్య, అనుష, ఉష, సరిత పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్లు కృతనిశ్చయంతో పని చేయాలి

● జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రఫీ


అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేస్తున్న కిషన్‌నాయక్


పారాలీగల్ వలంటీర్లకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న రఫీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :డాక్టర్ బీఆర్ అంబేద్కర్, న్యాయసేవా సంస్థలకు నిర్దేశించిన అందరికీ అందుబాటులో న్యాయం అనే లక్ష్యాన్ని చేరుకోవడానికి పారాలీగల్ వలంటీర్లు కృతనిశ్చయంతో పని చేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రఫీ సూచించారు. రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందిచటంలో పారాలీగల్ వలంటీర్లు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పారాలీగల్ వలంటీర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ఉచిత న్యాయసహయం మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా కేసులను సత్వర పరిష్కారం వంటి న్యాయసేవా సంస్థ విధులను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శాలినీ మాట్లాడుతూ న్యాయసేవా సంస్థ ద్వారా అమలయ్యే జాగృతి, డాన్, ఆశా, సంవాద్, స్పృహ తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సీనియర్ న్యాయవాది చెన్న మల్లారెడ్డి, రాజు, కృష్ణ పాల్గొన్నారు,

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలి : కిషన్‌నాయక్

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి అమలులోకి తీసుకువచ్చి 76 సంవత్సరాలు అవుతున్నప్పటికీ పేద, బడుగు, బలహీన, గిరిజన, ఆదివాసీ వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం అందటంలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు రాజ్యాంగ హక్కులు, చట్టాలను పూర్తిస్థాయిలో అమలుచేయాలని కోరారు. అనంతరం విద్యార్థినులకు రాజ్యాంగ అంబేద్కర్ జీవిత చరిత్ర, రాజ్యాంగ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో దుడ్డెల రామ్మూర్తి, నీరుడు సామేల్, కుర్ర మహేష్, మహేందర్ పాల్గొన్నారు,

● జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించి రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు పొడుగు నర్సయ్య, జలగం వీరస్వామి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు,

● జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, చీపిరి యాకయ్య, మందుల మహేందర్, మచ్చ వెంకన్న, శ్రీను, నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

● బయ్యారం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో దీపికతో పాటు సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలో నివాళులర్పించారు. కార్యక్రమంలో దైవాదీనం, చంద్రమోహన్, గౌసపాష, హరీష్, ఉమామహేష్ పాల్గొన్నారు. కాగా, దీంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో కూడా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

● కేసముద్రం : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని వివేకవర్ధిని హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కురవి : అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని దళితరత్న కామ సంజీవరావు అన్నారు. సీరోలు మండలం ఉప్పరిగూడెంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతాపని బిక్షమయ్య, కాలం ప్రభాకర్‌రెడ్డి, ఐతం వెంకటేశ్వర్లు, ఇనుగుర్తి వెంకటేష్, పేర్ల గణేష్, నీలకంఠం ఉపేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు. కురవిలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు గొల్లపల్లి రజినీకాంత్, ఎన్.రాజేందర్‌కుమార్, డాక్టర్ దడిగెల శరత్, బుక్క నాగరాజు, సంగెం నాగరాజు, రాగం వీరన్న పాల్గొన్నారు.

● మహబూబాబాద్ టౌన్ : మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాలలో సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశం కోసం 2సంవత్సరాల 11 నెలలు కష్టపడి రాజ్యాంగాన్ని రచించిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్, అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య, చాగంటి ప్రభాకర్, కృష్ణ ప్రసాద్, శ్రీపాల్‌రెడ్డి, ముత్తయ్య, ప్రసాద్, భీక్షం పాల్గొన్నారు.

నూతన ఆవిష్కర్తలు విద్యార్థులే : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరాభివృద్ధికి నూతన ఆవిష్కర్తలు విద్యార్థులేనని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత, శాస్త్రీయ విషయాలపై విద్యార్థుల్లో సహజమైన అభిరుచి, సృజనాత్మకతను వెలికితీస్తే నేటి విద్యార్థులే రేపటి భావిశాస్త్రవేత్తలుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంచడంతో పాటు నూతన ఆవిష్కరణలు రూపొందించే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. సైంటిఫిక్ ప్రయోగాల ద్వారానే నూతన ఆవిష్కరణలను చేయవచ్చని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడే విధంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. సైన్స్ జీవితంతో ముడిపడి ఉన్నందున సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించే విధంగా విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను రూపొందించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైన్స్ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ వారిని భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం వల్ల ఇతర విద్యార్థులతో తమ ఆలోచనలు పంచుకోవడంతో పాటు వివిధ రకాల ఎగ్జిబిట్స్‌ను చూడడం ద్వారా వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులు తెలుసుకుంటారన్నారు.

రాష్ట్రస్థాయి 23 ఎగ్జిబిట్లు ఎంపిక : జిల్లా సైన్స్ అధికారి

జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో 306 ఎగ్జిబిట్లు ప్రదర్శించగా ఇందులో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి అప్పారావు తెలిపారు. సైన్స్‌ఫెయిర్‌లో సీనియర్ విభాగంలో 07, జూనియర్ విభాగంలో 07, ఇన్‌స్పైయిర్‌లో 09 ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించిన ఎగ్జిబిట్లను జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చి తిలకించినట్లు తెలిపారు. అనంతరం ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులకు భోజన సదుపాయాలతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, నిర్వహణ కమిటీ బాధ్యులు రాందాస్, బీవీబీ ప్రసాద్, కల్లెం వెంకట్‌రెడ్డి, చాంప్లానాయక్, వెంకటేశ్వర్లు, వీరభద్రం, సదయ్య, ఆగుర్తి సురేష్, పుష్పలీల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో పదేళ్ల జైలు

గణపురం(జయశంకర్ భూపాలపల్లిజిల్లా), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులకు పదేళ్ల జైలు ఖరారైనట్లు ఎస్సై అశోక్ బుధవారం తెలిపారు. 2021లో చెల్పూరు నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఘటన చోటుచేసుకుందన్నారు. చెల్పూరుకు చెందిన బానోత్ బాబుకుమార్, ధరావత్ మల్సూర్, గోపు శ్రీధర్‌రెడ్డి, కొంరెడ్డి రవీందర్‌రెడ్డి, అంగోత్ రాజేందర్‌పై అప్పటి ఎస్సై కేసులు నమోదు చేశారన్నారు. నేరం రుజువు కావడంతో పదేళ్లజైలు, రూ.లక్ష జరిమానా చొప్పున విధిస్తూ జిల్లా ప్రధాన జడ్జి రమేష్ తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.


తాళ్లపూసపల్లిలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి జయరాజ్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

కేసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూసపల్లిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజు డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో గతంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు అవుతున్నప్పటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట కాలేరు గోపయ్య, గొట్టిపర్తి వెంకన్న, పూసపాసపాటి రాములు, రాజేష్ ఉన్నారు.

ఏడుగురు ఎస్టీ ఓటర్లు.. 4 పదవులు.!

(5వ పేజీ తరువాయి)

ఓటర్లు ఉండగా సమీపంలోని తండాకు చెందిన గిరిజన యువతి ఈ గ్రామ ఎస్సీ యువకున్ని ప్రేమవివాహం చేసుకోవడంతో ఆమె ఓటు కూడా గ్రామంలోనే ఉంది. వెరసి ఎస్టీ నుంచి గ్రామంలో ఏడుగురు ఓటర్లే ఉన్నారు. గత స్థానిక సంస్థలఎన్నికల్లో రెండువార్డులు ఎస్టీ రిజర్వుకాగా, ఈ రెండు కుటుంబాల్లోంచి ఒకరి చొప్పున ఏకగ్రీవంగా ఎనుకున్నారు. తాజాగా ఏడుగురు ఓటర్లలోంచే ఒకరు సర్పంచ్, ముగ్గురు వార్డు సభ్యులు కాబోతుండడం గమనార్హం. అత్యల్ప ఓటర్లు ఉండడంతో దాదాపు ఏకగ్రీవం అయ్యే అవకాశాలున్నట్లు పలువురు భావిస్తున్నారు.

'ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి'

డోర్నకల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపాలిటీలో డ్రైనేజీ కాలువలు, మునిసిపాలిటీ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డోర్నకల్‌కు చెందిన జక్కుల సురేష్ బుధవారం మునిసిపల్ కమిషనర్ నిరంజన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. మునిసిపాలిటీకి చెందిన కొందరు అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, దానివల్ల వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. స్థానిక పోస్టాఫీస్ పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువపై డోర్నకల్‌కు చెందిన అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ఏర్పాటు చేసిన అనధికార దుకాణం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న బోడ మల్సూర్

కురవి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న సర్పంచ్, ఎంపీటీసీల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమని మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. కురవి మండలం తట్టుపల్లిలో సొసైటీ డైరెక్టర్ బోడ మల్సూర్ బీఆర్ఎస్ నుంచి తన అనుచరులతో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అంబటి వీరభద్రం మాట్లాడుతూ గ్రామాల్లో రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీ బలహీనపడుతుందన్నారు. తోకల రాంచంద్రు, కొత్త యాకన్న, కత్తి వెంకన్న, గాలి సైదులు, పెండ్లి యాకయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం అన్నారు. కురవిలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.రాజేందర్‌కుమార్, అవిరె మోహన్ రావు, డాక్టర్ శరత్, దయ్యాల శ్రీధర్, బాదె వీరభద్రం, బుక్క నాగరాజు, చిన్నం గణేష్, కానుగంటి వీరన్న, బత్తిని సత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి వేవాలయంలో బుధవారం వల్లిదేవసేన సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిపించారు. ప్రధాన అర్చకులు రంగావఝ్జుల సుధాకరశాస్త్రీ-సునిత దంపతుల వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. జంగాల సత్యవతి, పుప్పాల రాజశేఖర్ - హైమావతి, తల్లాడ అంబరీష, శ్రీదేవి పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షురాలిని కలిసిన కాంగ్రెస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమను బుధవారం మహిళా కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా నియామకమైన ఆమెకు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉమను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నేతలు నారోజు సత్యమనోరమ, విజయలక్ష్మి, భూక్య లక్ష్మి, మాధవి, పద్మ, దేవి, నాగమణి, జమున, శిరీష పాల్గొన్నారు.


డీసీసీ అధ్యక్షురాలు ఉమను సన్మానిస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

భూపతిపేటలో వాహనాల తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భూపతిపేటలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. గూడూరు సీఐ జి.సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి నేతృత్వంలో సిబ్బంది వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా వాహనాల్లో నగదు, మద్యం తరలించకూడదన్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేల ప్రజలు సహకరించాలన్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో వివాదాస్పద పోస్టులు పెట్టొద్దు

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో సోషల్‌మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో అనవసరమైన,వివాదాస్పదమైన, మతపరమైన, వ్యక్తిగతంగా ఇబ్బందులు కలిగించే అంశాలను పోస్టులు పెట్టవద్దని గూడూరు ఎస్సై గిరిధరెడ్డి హెచ్చరించారు. వాట్సాప్ గ్రూపులను నిర్వహిస్తున్న వారితోపాటు గ్రూప్ అడ్మిన్‌గా ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనవసరమైన విషయాలను గ్రూపుల్లో ఫార్వర్డ్ చేస్తే వెంటనే వాటిని రిమూవ్ చేయాలని సూచించారు.

నామినేషన్ల పండుగ

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఆపై పోటీ చేస్తున్న అభ్యర్థుల తుది జాబితాను ప్రచురిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ ఉంటుంది. అనంతరం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. ఆ వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. తదుపరి అదేరోజు ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహిస్తారు.

మానుకోట మండలంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలివే..

పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు మూడు నుంచి ఐదు గ్రామాలతో క్లస్టర్‌లుగా ఏర్పాటు చేశారు. అక్క డ ఆ క్లస్టర్ పరిధిలోని జీపీలు, వార్డు సభ్యులకు పోటీచేసే వారి నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. మండలంలో 41 గ్రామపంచాయతీలు ఉండగా 12 క్లస్టర్లుగా విభజించారు. పర్వతగిరి గ్రామపంచాయితీ కార్యాలయంలో సోమ్లతండా, లక్ష్మాతండా, పర్వతగిరి, జంగిలిగొండ గ్రామంలో రోటిబండతండా, కేవులతండా, జంగిలిగొండ వీఎస్ లక్ష్మీపురం గ్రామంలో హజారియా తండ, సింగారం, ఇస్లావత్‌తండా (ఎస్), వీఎస్. లక్ష్మీపురం, వేమునూరు గ్రామంలో ఉత్తరతండా, సీత్లా తండా, వేమూనూరు, చిన్నకిష్టాపురం గ్రామంలో ఇంద్రనగర్ కాలనీ, చిన్న కిష్టాపురం, బ్రాహ్మణపల్లి లక్ష్మీపురంగ్రామంలో దర్గాతండా, లక్ష్మీపురంతండా, కొమ్ముగూడెం, బ్రాహ్మణపల్లి లక్ష్మీపురం, మాదావపురం గ్రామంలో జర్పులతండా, ఇస్లావత్‌తండా (ఎం), తూర్పుతండా, మాదావపురం, అమనగల్ గ్రామంలో బలరాంతండా, గుండాల గడ్డతండా, అమనగల్, అయోధ్యగ్రామంలో ముడుపుగల్, అయోధ్య, రెడ్యాల గ్రామంలో సికింద్రాబాద్‌తండా, నడివాడ, గడ్డిగూడెం తండ, రెడ్యాల, కంబాలపల్లిలో బోడగుట్టతండా, మొట్లతండా, సంద్రలగూడెం, కంబాలపల్లి, మల్యాల గ్రామంలో చోక్లాతండా, దామ్యతండా, రేగడితండ, సాదుతండా, మల్యాల గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డులకు నామినేషన్‌లు వేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కేసముద్రం మండలంలో..

● కేసముద్రం : మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో ఎన్నికలకు 10 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో క్రాంతి వెల్లడించారు. కాట్రపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో భవాని గడ్డతండా, కాట్రపల్లి, అర్పనపల్లి గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు స్వీకరిస్తారని, ఉప్పరపల్లి జీపీలో అదే గ్రామం, ఇంటికన్నె జీపీలో వెంకటగిరి, ఇంటికన్నె, చంద్రుతండా, మహమూద్‌పట్నం జీపీలో కోరుకొండపల్లి, భూక్యరాంతండా, మహమూద్‌పట్నం, తౌర్యతండా, కల్వల జీపీలో సప్పిడిగుట్టతండా, కల్వల, గాంధీనగర్, నారాయణపురం జీపీలో క్యాంపు తండా, పీక్లాతండా, నారాయణపురం, తాళ్లపూసపల్లి జీపీలో పెద్దమోరీతండా, తాళ్లపూసపల్లి, ధర్మారం తండా, అన్నారం, రంగాపురంలో బిచ్యానాయక్‌తండా, రంగాపురం, సర్వాపురతండా, బేరువాడలో బోడమంచ్యాతండా, బేరువాడ, మర్రితండా, పెనుగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో నర్సింహులగూడెం, పెనుగొండ గ్రామాల అభ్యర్థులు నామినేషన్లను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఇనుగుర్తి మండలంలో..

● ఇనుగుర్తి : మండలంలోని 13 గ్రామపంచాయతీలకు ఐదు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బండారు పార్థసారధి తెలిపారు. ఇనుగుర్తి జీపీలో అదే ఇనుగుర్తి గ్రామం, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లాలుతండ, రాముతండ, చీన్యాతండ, అయ్యగారిపల్లి గ్రామాలు, చిన్ననాగారం జీపీలో మీట్యాతండ, చిన్ననాగారం గ్రామాలు, కోమటిపల్లి జీపీలో పాతతండ, తారాసింగ్ తండ, కోమటిపల్లి గ్రామాలు, చిన్నముప్పారం జీపీలో లక్ష్మీపురం, చిన్నముప్పారం, పెద్దతండా గ్రామాల అభ్యర్థుల నామినేషన్లను స్వీకరిస్తారని తెలిపారు.

గూడూరు మండలంలో

● గూడూరు : మండలంలో 41 గ్రామపంచాయతీలు ఉండగా 12 నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.అప్పరాజుపల్లిలోజంగుతండా, దుబ్బగూడెం, దామరవంచ, అప్పరాజుపల్లి, తీగలవేణిలో లక్ష్మీపురంతండా, పాటిమీదితండా, గోవిందాపురం, తీగలవేణి, మచ్చర్లలో బ్రహ్మణపల్లి, ఊట్ల, ఏపూరు, మచ్చర్ల, బొల్లెపల్లిలో నాయకపల్లి, రాజన్‌పల్లి, శత్రుతండా, బొల్లెపల్లి, గూడూరులో గూడూరు, మర్రిమిట్టలో లైన్‌తండా, కోబల్‌తండా, మర్రిమిట్ట, బొద్దుగొండలో జగన్నాయకులగూడెం, కోల్లాపురం, బొద్దుగొండ, మట్టేవాడలో ఎర్రకుంటతండా, శ్రీహనుమాన్‌తండా, మట్టేవాడ, పొనుగోడులో పడమటితండా, రాములుతండా, చిర్రకుంటతండా, పొనుగోడు, భూపతిపేటలో చిన్నేల్లాపురం, సీతానగరం, వెంగంపేట, భూపతిపేట, గుండెంగలో తేజావత్ రాంసింగ్‌తండా, గన్నెచక్రుతండా, గుండెంగ, అయోధ్యపురంలో హరిశ్చంద్రునితండా, గాజులగట్టు, మదనాపురం, అయోధ్యపురం, గ్రామాలకు సంబంధించిన 12 నామినేషన్ కేంద్రాలలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నెల్లికుదురు మండలంలో..

●నెల్లికుదురు : మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ఎన్నికలకు 9 నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కుమార్ వెల్లడించారు. ఎర్రబెల్లిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎర్రబెల్లిగూడెం, కాచికల్, బడితండా అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారని వెల్లడిం చారు. మేచరాజుపల్లి జీపీలో మేచరాజుపల్లి, పెద్దతండా, సొక్లతండా, నెల్లికుదురుజీపీలో నెల్లికుదురు, రామన్నగూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, నైనాల జీపీలో నైనాల జామతండా, రత్తిరాంతండా, నలగుట్ట తండా దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. హనుమాన్‌నగర్‌తండా జీపీలో హనుమాన్ నగర్‌తండా, రాజుల కొత్తపల్లి, సీతారంపురం, పార్వతమ్మగూడెం జీపీలో పార్వతమ్మగూడెం, దుర్గభవానితండా, వస్త్రాంతండా, మునిగలవీడు జీపీలో మునిగవీడు, శ్రీరామగిరి, మధనతుర్తి. నర్సింహులగూడెం జీపీలో నర్సింహులగూడెం, కాస్యతండా, బంజర, హేమ్లాతండా, వావిలాల జీపీలో వావిలాల, ఆలేరు, బోటిమీది తండా, రాజ్యతండాలలో నామినేషన్ స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎలక్షన్ల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

దొంగతనాలు, పెండింగ్ కేసులను ఎస్ఐ క్రాంతికిరణ్‌ను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఇనుగుర్తిలో సరిహద్దు చెక్‌పోస్టులపై వివరాలు అడిగారు. కొత్తగా ఏర్పడిన పోలీస్‌స్టేషన్ కావడంతో ప్రజలకు నమ్మకం కలిగించేలా విధులు నిర్వహించాలని ఎస్ఐ జి.కరుణాకర్‌ను ఆదేశించారు. నెల్లికుదురులో ఎన్నికల సమయంలో ఏర్పడే సమస్యలను పరిష్కరించుకుంటూ సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలని ఎస్ఐ రమేష్‌బాబును ఎస్పీ ఆదేశించారు. ఆయన కేసముద్రం సీఐ వై.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.